విసుగులోనూ, కోపంలోనూ, సీత మొహంకేసి చూసి "చ స్తే చావు, నీకు అడ్డమొచ్చినవా డెవడు యిక్కడ?" అనేశాడు మూర్తి.

సీతకు కోపం పట్టరానంతగా వచ్చింది. "ఎందుకు ఇలాటి వెధవ బ్రతుకు" అని దభాలున వీధి తలుపు తీసుకొని, ఛడేల్మని వేసేసు కొని సీత బయటికి వెళ్ళిపోయింది.

పది నిమిషాలలో ఇంత ఘోరమైన పరిణామం వచ్చిందేవి అని ఆలోచిస్తూ, దిగ్భ్రమచెంది మూర్తి అలాగే, కుర్చీలో కూచున్నాడు.

ఒక నిమిషంకూడా గడవలేదు. మెల్లిగా తలుపు తెరుచుకొని సీత లోపలికి వచ్చింది.

మూర్తి తలయెత్తి, తెల్లబోతూ ఆమెవంక చూశాడు.

"బయటంతా, చీకటి గబ్బగీములాగ వుంది. ఏ దొంగ వెధవ లేనా తల పగల గొడతారేమో కూడాను" అంటూ పడక గదిలోకి వెళ్ళింది సీత.

---

# 6. యోగి - భోగి

"జై భగవాన్, జై" అంటూ యెవడో వచ్చి అరుగుమీద కూచున్న చప్పుడు విని రమణమ్మ తలుపు తీసి చూసింది. మూరెడు పొడుగుగడ్డం, జడలుగట్టిన జుట్టు, వొళ్ళంతా విభూతీ, కాషాయ గుడ్డలూ, బక్కచిక్కిన దేహం - కనిపించేటప్పటికి రమణమ్మకి వొళ్లు జలదరించింది.

రమణమ్మ తలుపు తీసేటప్పటికి, ఆ కాషాయాంబరధారి మళ్ళీ "జై భగవాన్, గురుదేవ్ జై" అన్నాడు. రమణమ్మ వీపుమీద యెవరో గ్రుద్దినట్లయింది.

"వెళ్లు వెళ్ళు. ఇంట్లో ఎవరూ లేరు" అని తెచ్చుకున్న ధైర్యంతో అంది. ఆ బైరాగి రమణమ్మకేసి చూశాడు.

"యోగీశ్వరుడికి ఒక పూట అన్నంపెట్టలేరమ్మా!" అని ఈసడించాడు బైరాగి. రమణమ్మ బెదిరింది.

"మగవాళ్ళు యింట్లో లేరు" అంది. తనేమైనా తప్పు చేశానా అని తటపటాయించుకుంది.

"రానీ! ఆయన వొమ్మంటే అప్పుడు చూస్తాం" అని జవాబు చెప్పి కళ్ళు మూసుకున్నాడు బైరాగి. ఎక్కువ చప్పుడు చెయ్యకుండా తలుపు వేసుకొని రమణమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

అప్పటికప్పుడే రెండుజాములు కావస్తున్నది. సుబ్బయ్యశాస్త్రి యింటికి యింకా రాలేదు. ఎండ పెళపెళ లాడుతోంది. బైరాగి అరుగు మీద అలా కూచునే వున్నాడు. అరుగుమీదకు వాలిన తాటాకుచూరు వల్ల బైరాగిమీద యెండ పడటం లేదు.

భుజాన వ్రేలాడవేసుకున్న బియ్యపు మూటా, చేతిలో పట్టుకున్న విస్తరాకుల మడతలూ, నెత్తిన చుట్టుకున్న అంగవస్త్రమూ, తను యెక్కడో పౌరోహిత్యానికి వెళ్ళినట్లు స్ఫురిస్తూ వుండగా సుబ్బయ్య గబగబ అడుగులు వేసుకుంటూ వచ్చి మెట్లు యెక్కి "తలుపు, తలుపు" అని కేకవేసి గొళ్లెం చప్పుడు చేశాడు.

బైరాగి కళ్ళుతెరిచి సుబ్బయ్యశాస్త్రిని చూశాడు. సుబ్బయ్యశాస్త్రి బైరాగివైపే చూస్తూ వున్నాడు.

రమణమ్మ వచ్చి తలుపు తీసింది. ఇంట్లోకి వెళ్ళి భుజానవున్న మూట దింపుకొని, విస్తరాకులు గోడవారగా పెట్టి, తలకు చుట్టుకున్న అంగవస్త్రం విప్పి, మొహంమీది చెమటంతా తుడుచుకొని, "ప్రొద్దో యింది. వంటయిందా?" అన్నాడు సుబ్బయ్యశాస్త్రి.

"ఆ. అయింది. మడిగట్టుకోండి" అంది రమణమ్మ.

"జై భగవాన్, గురుదేవ్ జై" అని బయటనుంచి కేక వేశాడు బైరాగి.

దంపతు లిద్దరూ ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు.

"ఇక్కడ భోజనానికి వుంటాడుట——" అని రమణమ్మ అంది.

"ఎవ రతడు?" అని అడిగాడు సుబ్బయ్యశాస్త్రి.

"ఏమో! నాకుమాత్రం యేంతెలుసు? వచ్చి అరుగుమీద కైఠా యించాడు. ఇంట్లో యెవరూ లేరు పొమ్మన్నాను. మీరు వచ్చేదాకా వుంటా నన్నాడు."

"అయితే మరి అడిగి వస్తా నుండు" అని సుబ్బయ్యశాస్త్రి బయటికి వచ్చాడు. బైరాగి కళ్ళుమూసుకుని వున్నాడు.

"ఏ వూరు బాబూ మంది?" అన్నాడు సుబ్బయ్య.

బైరాగి కళ్లువిప్పి చూసి, తల ముందుకీ వెనక్కీ ఆడించి "ఒక వూరేమిటి?" అన్నాడు.

"తమ పేరు?...."

"పేరులో యేముంది?"

"......................"

"......................"

సుబ్బయ్య శాస్త్రికి యేం చెయ్యాలో తోచలేదు.

"ఇక్కడ భోజనం చేస్తా నన్నారా?" అన్నాడు.

"మీకు ఇబ్బందిలేకపోతే. కులగోత్రాలు నన్ను అంటిపెట్టుకుని లేవుగాని, అయినా నేను పుట్టినకులం బ్రాహ్మణులేనట; అంచేత నాకు భోజనం పెట్టడానికి మీరు సందేహించ నక్కరలేదు" అని చెప్పాడు బైరాగి.

"తమరు, పెరట్లో బావి దగ్గర స్నానం చెయ్యండి, 'అభ్యాగత స్స్వయం విష్ణు' అని పెద్దలు సెలవిచ్చారు. అందులోనూ సర్వసంగ పరిత్యాగులైన............" అని, అంతటితో ముగించాడు సుబ్బయ్యశాస్త్రి.

స్నానానికి లేస్తూ బైరాగి, సుబ్బయ్యశాస్త్రి మొహం చూశాడు. ప్రొద్దుటినుంచీ యెండలో తిరగడమువల్ల కాబోసు, నల్లబడి, కళ్ళు లోతుకుపోయి యెంతో శ్రమను సూచిస్తున్నది ఆ మొహం.

ఈ యిల్లూ, భార్యా, యీ శ్రమకోసమా? అనుకున్నాడు బైరాగి. ఏ బాధాలేకుండా, యే తాపత్రయమూ లేకుండా, హాయిగా, పూట కొక యిల్లు, రోజు కొక ఊరుగా తిరిగే తన అదృష్టం—చాలా గొప్ప

దనుకున్నాడు. ఆ యెండలో తిరగటం మాటలా- ఎందుకింత బాధ పడుతున్నాడు యీ గృహస్థు? హాయిగా దేశమంతా తిరగవచ్చునే!- ఈ పాడు సంసారం యెందుకు? బ్రతికున్నన్నాళ్లూ యిందులో బాధ పడవలసినదేనే? ఒక్కరోజు తెరిపి వుండదే! ఒక్క నిమిషము హాయిగా వెళ్ళదే....ఆహా! తన జీవితం ఎంత సుఖమైనది! అంత బాధపడుతూ, ఈ సంసారం కోసం మానవులు యెందుకు ప్రాకులాడుతారూ? అనుకున్నాడు బైరాగి.

పెరట్లో బావి దగ్గర బైరాగి స్నానము చేసిన తరువాత, సంసారి కూడా స్నానం చేశాడు.

బైరాగికి దేవతార్చన లేదు. సంసారి దేవతార్చన చేసుకున్నాడు. రమణమ్మ వడ్డన ఆరంభించింది.

బైరాగి, వైరాగ్యంలో దిగి పదేళ్ళయింది. తన పందొమ్మిదో యేట, తన చదువుకి కావలసిన డబ్బు తన పినతండ్రి యివ్వలేదని, తల్లిదండ్రులులేని దుస్థితిని బాపుకోడానికి దారిలేక, అంత చిన్నతనంలోనే, బైరాగులలో కలిసిపోయాడు.

ఎన్నో వూళ్ళు తిరిగాడు. ప్రతి వూళ్ళోను బియ్యం ముష్టి యెత్తుకొని తనకు తానే వండుకు తినేవాడు.

ఇవ్వాళ, అదేమిటోగాని, రమణమ్మచేతి అన్నం తినా లనిపించింది. హోరున కొడుతూ ఉన్న వడగాలిలో, అన్నం వండుకోవడం కష్టం అనిపించింది. అందుచేత, మొండికేసి సుబ్బయ్యశాస్త్రిగారి యింట్లో తిష్ఠ వేశాడు.

అక్కడికి వచ్చినప్పటినుంచీ, అదేమిటోగాని సంసారులు ఈ తాపత్రయాన్ని యెందుకు పడతారో చూద్దామని బుద్ధిపుట్టింది బైరాగికి- ఆ భార్యాభర్తల ధోరణి చూసినకొద్దీ....యేమి టీ చిత్రం?.........అనుకున్నాతు. భర్త భార్యమీద అనురాగాన్ని చూపతూనే ఉన్నాడు. భార్య భర్త మీద భక్తి తొణికిస్తూనే వుంది. కాని 'మన మిద్దరం వొకరి కొకరం కట్టుబడిపోయాము. నీ జీవితానికి నేనూ, నా జీవితానికి నువ్వూ బంధాలు. నీకోసం నేనూ, నా కోసం నువ్వూ కష్టపడాలి' అని ఒకరి అంతరాత్మ ఇంకొకరితో చెపుతోందా అనుకున్నాడు బైరాగి. 'ఛీ'

అనిపించింది. 'ఛీఛీఛీ....యెందుకు యీ బాధ? ఎవరిదారిన వాళ్ళు హాయిగా బ్రతక వచ్చునే' ఎందుకో, యీ లంకె, యీ ఘోరం?....ఈ లంకెను విడదీసుకోగలడా యీ సంసారి' అని కంపించాడు.

రమణమ్మ నేతిగిన్నె తీసుకొని వచ్చింది.

"అయ్యా! కానీండి" అంటూ, అన్నం కలపడం ఆరంభించాడు సుబ్బయ్యశాస్త్రి.

బైరాగి కూడా అన్నం కలిపాడు. వరస వరసగా, వడ్డించిన వస్తువులన్నీ తిన్నాడు....మాటి మాటికీ వడ్డనకు వచ్చి అది కావాలా, ఇది కావాలా అని అడిగిన రమణమ్మ ప్రశ్నలూ, "వారి కేం కావాలో కనుక్కో" అని సుబ్బయ్యశాస్త్రి రమణమ్మతో చెప్పేమాటలూ, ఆ భోజనమూ....పూర్తి అయ్యేసరికి—బైరాగికి నిద్ర వచ్చింది....పదేళ్ళ యీ మధ్య అంత మైకం కలిగేటట్టు తనెన్నడూ భోజనం చెయ్యలేదు.

సంసారులకి సౌఖ్య మనేది యేదైనా ఉంటే యీ భోజన సౌఖ్య మొక్కటే అనుకున్నాడు.

ఓ! ఏమినిద్ర! హాయిగా, అలా యెంత సేపు పడుకున్నాడో, ఆ భోజనంలో అంత సుఖ ముం దనిపించింది బైరాగికి. కాని— ఎబ్బే! కేవలమూ, యీ భోజనంకోసం యింత శ్రమపడడము మాన వుని మౌఢ్యమే—ఎబ్బే.

బైరాగి నిద్ర నుంచి లేచేటప్పటికి యింకా బారెడు ప్రొద్దు మాత్రం మిగిలింది.

సుబ్బయ్యశాస్త్రి, బావిలో నీళ్లు కడవలతో తోడి, ఆవుకు నీళ్ళు పట్టే తొట్టెలో పోస్తున్నాడు—రమణమ్మ లోపల యిల్లంతా వూడ్చు కుంటోంది.

'ఈ ఆడదీ మగాడూ కలసి, యిలా అవస్థపడి భుక్తి గడుపు కుంటున్నారా?' అనుకున్నాడు. కాని—యిలాటి సంసారులు లేక పోతే తనకి పట్టెడు బియ్యంకూడా పెట్టేవాళ్లు లేరే—

లేకపోతే యేం? ఇంత అవస్థపడేకన్న, దుంపలు తిని నీళ్లు త్రాగి బ్రతకవచ్చునే అనుకున్నాడు. కాని, కొన్నాళ్ళ క్రితం దుంపల

ఆహారమే తాను తినవలసి వచ్చింది. ఆ రోజు తనకు యెలా వున్నదీ పోల్చి చూసుకున్నాడు.

ఇన్ని కూరలూ, పచ్చళ్లూ, నెయ్యీ, పెరుగూ- యీ భోజనంలో సౌఖ్యం లేకేమి?

అయితే, యీ సౌఖ్యం కోసం యింత శ్రమా!

బైరాగికి యిదంతా చిత్రంగా ఉంది నెయ్యీ, పాలూ, పెరుగూ కోసం, ఆవును సాకాలీ? దాని కస వెత్తి, అడ్డమైన చాకిరీ చెయ్యాలీ?

ఎందుకూ?—

సుబ్బయ్యశాస్త్రి వచ్చి "బాగా నిద్రపోయారు" అన్నాడు.

"అవును, అవును. మీ యింటి భోజనం అంత మత్తు కలిగించింది" అన్నాడు బైరాగి.

"ఏదో, బీదవాళ్ళము."

ఓయి బాబో, బీదవాళ్లయిన సంసారుల భోజనమే తన కింత బద్ధకాన్ని పుట్టిస్తే, ధనవంతుల యింటి భోజనం యెంత మత్తును కలిగిస్తుందో!

"తమరు రేపు ఉదయం దాకా మా గృహంలోనే వుండండి..."

"అదే ఆలోచిస్తున్నాను. అప్పుడే ప్రొద్దుగూక వచ్చింది. ఇంక యిప్పుడు యెక్కడికి పోగలను?...."

"స్వామీ, తమరు యింటికి రావడమే నా అదృష్టం. అలాంటిది రెండు పూటలు తమర్ని అతిథిగా అట్టే పెట్టుకోవడము నాకెంత ఆనంద ప్రదమో తెలుసా?"

ఇంత పిచ్చివాళ్లా గృహస్థులు! ఎలాగయినా ఆ రాత్రికి అక్కడ ఉండి పోదలచుకున్నాడు బైరాగి. "మీ ఆదరణకి చాల కృతజ్ఞుణ్ణి" అన్నాడు.

సుబ్బయ్యశాస్త్రి బ్రహ్మానందం పొందాడు. బైరాగికి కొంచెం దూరంగా ఆ అరుగుమీద కూచుని ఆయన ఉదంతమంతా సావధానంగా అడిగి తెలుసుకున్నాడు. పది సంవత్సరాలనుంచి సర్వసంగ పరి పరిత్యాగం చేసిన మహనీయుడు. ఈ పది సంవత్సరాలలోనూ యిదే మొదటితడవ తన ఆతిథ్యాన్ని స్వీకరించి, తృప్తిపడటం. ఇది తనను

స్వర్గలోకానికి ఒక్కపెట్టున లాగేసిందన్నమాటే. తను ఎంత అదృష్ట వంతుడు!

ఇంతట్లో, మేతకి వెళ్ళిన ఆవు యింటికి తిరిగి వచ్చింది. సుబ్బయ్యశాస్త్రి లేచి, దానిని రాటస కట్టివేసి భార్యను వేన్నీళ్ళు తెమ్మని- ఆ నీళ్ళతో ఆవు శరీరమంతా కడిగి, కుడితిబెట్టి, దూడను విడిచి పాలు పితికాడు.

బైరాగి యిదంతా చూస్తున్నాడు.

సుబ్బయ్యశాస్త్రి చొప్పమోపు విప్పి, గొడ్డలితో దానిని నరికి, ఆవు ముందరా, దూడ ముందరా వేశాడు. ఆవుదగ్గరనుంచి తీసుకున్న పాలకి యీ చొప్పదంటూ, ఆ కుడితీ బదులా?

చిత్రం! ఈ సంసారమే చిత్రం. ఆ భార్యా, యీ ఆవూ.... వీళ్ళిద్దరి దగ్గరా, యేదో వొక ఫలితాన్ని పొందుతూ, వాళ్ళకోసం తనూ కష్టపడుతున్నాడు ఆ సంసారి. చిత్రం! ఏమిటో—ఈ సంబంధం? ఇహ యితనికి పిల్లలు కలుగుతారు కాబోలు. అప్పుడు మరీ తెగని సంబంధము క్రింద పరిణమిస్తుంది. ఇంకా వచ్చేపోయే బంధువులు- తనలాటి బైరాగులు, వీళ్ళందరికోసమూ- గృహస్థు యిలా కష్టపడ వలసిందే! ఆలోచించాడు బైరాగి.

చీకటి పడింది. కాని పగలుకాసిన యెండకు జవాబుగా, ఆకాశ మంతా మబ్బు క్రమ్మింది. ఉక్కకూడా పట్టింది. "వాన వస్తుందేమో, భోజనానికి త్వరగా లేవండి" అంది రమణమ్మ.

"స్నానం చేస్తారా స్వామీ, వేన్నీళ్లు?" అని అడిగేడు సుబ్బయ్య శాస్త్రి. చేస్తేనే నయమనిపించింది బైరాగికి. గోరువెచ్చని ఆ నీళ్ళు శరీరం మీద పోసుకుంటూవుంటే- పదేళ్ళనుంచి యీ సుఖాలే తను యెరుగడు కనుక- మానవుడి శరీరం యింత హాయిని అనుభవించగలదా అనుకున్నాడు. కాని, ఈ హాయి కోసమేనా గృహస్థు పడే బాధలన్నీను! స్నానమూ, భోజనమూ—ఈ రెండిటికోసమూ అన్ని అవస్థలు యే గృహస్థు అయినా అనుభవిస్తాడా? ఈ బాధపడకుండా ఆ రెండూ దొరకవు.

మళ్ళీ భోజనాలు, కమ్మని కందిపచ్చడి, తియ్యని పెరుగు, బైరా

గికి భోజనంలో వుండే రుచిని బాగా తెలియజేశాయి.

ఈ యోగీ, భోగీ—యిద్దరూ భోజనాలు ముగించి లేచేటప్పటికి మబ్బు గాటంగా పట్టింది. చల్లటిగాలి ఆరంభించింది.

''మంచి గొప్పవానే వచ్చేటట్టువుంది' అన్నాడు బైరాగి.

''అవునండి. తమరు యీ నడవలో పడుకోండి'' అన్నాడు సుబ్బయ్యశాస్త్రి.

''ఎక్కడనైతే నేమిటి, ఈ పాడు శరీరాన్ని పడవెయ్యటానికి'' అన్నాడు బైరాగి.

కొంచెంసేపు యిద్దరూ ప్రపంచపు తరహానుగురించి మాట్లాడుకున్నారు. రమణమ్మ భోజనంచేసి యివతలకు వచ్చింది.

''వీరికి యీ నడవలో పక్కవెయ్యి'' అని భార్యకి ఆజ్ఞ యిచ్చాడు సుబ్బయ్యశాస్త్రి.

''అలాగే'' అంటూ బైరాగివైపుచూసి, నడవకు ప్రక్కగా వున్న తమ పడక గదిలోకి చరచరా వెళ్ళి, నులకమంచాన్ని తీసుకొచ్చి నడవలో వేసి, దానిమీద జంబుకాన పరిచి, తలగడను అమర్చింది రమణమ్మ.

మంచం మీద పడుకుని పదేళ్ళయింది బైరాగికి.

''పండుకోండి స్వామీ, అలాగ'' అని చూపించాడు సుబ్బయ్యశాస్త్రి.

బైరాగి ''జై భగవాన్'' అంటూ మంచ మెక్కాడు.

చల్లగాలి బాగా వీచడం ఆరంభించింది.

సుబ్బయ్యశాస్త్రి మెల్లగా పడక గదిలోకి వెళ్లాడు.

''తమలపాకులు వేసుకోరూ?'' అని వంట యింట్లోనుంచి రమణమ్మ కేక వేసింది.

''స్వామీ, తమలపాకులు—'' అన్నాడు సుబ్బయ్యశాస్త్రి.

''అబ్బే, వద్దువద్దు'' అన్నాడు బైరాగి.

''స్వాములవారికి వద్దుట—'' అని కేకవేశాడు సుబ్బయ్యశాస్త్రి.

అంటే- తనకి కావాలని కాబోలు అనుకున్నాడు బైరాగి.

గప్పుమని మల్లెపూల వాసన వేసింది. బైరాగి తలయెత్తి చూశాడు. తలనిండా మల్లెపూలు పెట్టుకొని, చేత్తో పొందాను పట్టుకొని రమణమ్మ పడకగదిలోకి వెళ్ళుతూ వుంది. బైరాగి కళ్లు మూసుకున్నాడు.

పగలంతా ఆమె మొహానలేని, యేదో క్రొత్త అందం బైరాగికి కనిపించింది భార్యాభర్త లిద్దరూ తమలపాకులు వేసుకుంటున్నారు.

ప్రొద్దున నిద్రలేచినదిమొదలు, యిప్పటివరకూ శ్రమేకదూ పాపం! ఇప్పుడా ఈ దంపతులకి యేకాంతమూ, ఒకరితో వొకరు మాట్లాడుకోవడమూను! ఆలోచిస్తున్నాడు బైరాగి.

పడక గదిలో అగరువత్తులు వెలిగించింది రమణమ్మ. హోరున వీస్తున్న చల్లటిగాలికి మల్లెపూల ఘుమఘుమలూ, అగరువత్తుల ధూపమూ వసారాలోకికూడా వచ్చాయి. బైరాగి ప్రాణం ఉక్కిరిబిక్కిరి అయిపోతోంది. కీచుమనే చప్పుడుతో పడకగది తలుపువేసింది రమణమ్మ.

బైరాగి మళ్ళీ తలయెత్తి చూశాడు. ఏమీ లేదు. కొంచెం సేపటికి పడకగదిలోనుంచి గుసగుసలు వినపడ్డాయి.

పగటిపూట తాము పడ్డ కష్టాలన్నీ భార్యాభర్తలు వొకరికొకరు చెప్పుకుంటున్నారు కాబోసు.

బైట వాన ఆరంభించింది. నిమిష నిమిషానికీ యెక్కువై పోతోంది.

బైరాగికి మంచంమీద నిద్రపట్టడం లేదు. ఉరుముల చప్పుడు, దాన్నిమించిన గుసగుసల చప్పుడు, మధ్యమధ్య కిలకిల రమణమ్మ నవ్వు.

ఏం మాట్లాడుకుంటున్నారూ! బైరాగికి చాలా కుతూహలంగా వుంది. భార్యాభర్తలు పడకగదిలో యేం చెప్పుకుంటారూ?

ప్రొద్దున లేచింది మొదలు స్త్రీ పురుషులు పడేపాట్లు ఇందుకా! ఆ వేన్నీళ్ళ స్నానంకన్న, ఆ కమ్మని భోజనంకన్న యీ దంపతుల్ని ఒకరి నొకరు యెక్కువగా ఆకర్షించుకొనేటట్టుచేసి, ఒకరికోసం యింకొకరు తాపత్రయ పడేటట్టుచేసినది యీ పడక గదేనా!

బైరాగికి చాలా చిత్ర మనిపించింది. ఇంక యెక్కువసేపు అక్కడ వుండటము దుస్సాధము. ఆ భార్యాభర్తలు అనుభవించే

సుఖం తనను కూడా ఆకర్షిస్తే!

"జై భగవాన్ జై!"

వాన కురిసి కురిసి, దానంతట అదే వెలిసింది. ఆకాశముమీద నక్షత్రాలు పొడచూపాయి.

చప్పుడుకాకుండా వీధితలుపుతీసి, తెల్లవారటానికి యింకా జాముష్నర ప్రొద్దువున్నప్పటికీ, చెప్పకుండా వెళ్ళిపోయాడు బైరాగి.

తెల్లవారిన తరవాత, ఇంట్లో సామాను లేవీ పోలేదని చూసుకున్నాక "దేవుడే అలా వచ్చాడేమో!" అంది రమణమ్మ.

---

# 7. ప్రేమ

అర్థరాత్రి సరిగ్గా పన్నెండు గంటలవేళ. వీధి తలుపు చప్పుడయింది. ఇంట్లో ఉన్నవారు ఒక్కొక్కరే "ఎవరు వారూ?" అని కేక వేశారు. ఆ ప్రశ్నకు సమాధానం రాలేదు. తలుపు చప్పుడు మాత్రం అవుతూనే ఉన్నది. లేచి వెళ్ళి తలుపు తియ్యడానికి ఎవరికి వారికే బద్ధకంగా ఉంది. ఎవరూ లేవలేదు. చప్పుడు—మెల్లగా—అవుతునే వున్నది.

"ఎవ రంటే మాట్లాడ రేమిటమ్మా? అమ్మాయీ కనకం, వెళ్లి తలుపు తియ్యి. మీ బాబాయి అయివుంటాడు. ఆయనకు యిదే దురలవాటు. ఎంత పిలిచినా పలకడు" అని వసారాలో మూలగా పడుకున్న ముసలమ్మ సణిగింది.

"వస్తున్నా ఉండండి, ఎవరో" అని కనకం—కళ్ళు నులుముకుంటూ నడవ గదిలోనుంచి వసారాలోకి వస్తూ అంది. ఆ జవాబుతో తలుపు చప్పుడు ఆగింది.

అగ్గిపెట్టెకోసం, రాత్రి యెప్పుడో ఆర్పి, ఎక్కడో పెట్టిన లాంతరు కోసం వెతుక్కొని, లాంతరు వెలిగించుకొని, కనకం తలుపు